క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



గొట్టాపు సూర్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: డీసీఎంఎస్ డైరెక్టర్ గొట్టాపు సూర్య నారాయణ తల్లి నారాయణమ్మ శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోమటిపల్లిలోని స్వగృహానికి వెళ్లి నారాయణమ్మ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వడ్డి వెంకటరమణ, గొట్టాపు సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు వంగపండు శ్రీరాములనాయుడు, గొట్టాపు అప్పారావు, పాపారావు, తదితరులున్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

బాడంగి: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తప్పిపోయిన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మే ఒకటో తేదీ నుంచి 20 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి. శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్, ఇంటర్ విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో ప్రత్యేక తరగతులను ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

జోరుగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే



చొక్కాపువీధిలో సర్వే చేపడుతున్న డాక్టర్ ఏఎల్‌జీ శిరీష, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు

రామభద్రపురం: మండలంలో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే జోరుగా సాగుతోంది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, వలంటీర్లు శనివారం ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం డాక్టర్ శిరీష మాట్లాడుతూ, సర్వే ఆధారంగా వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, వైద్యసేవలందిస్తామని తెలిపారు.

పిల్లల చదువు పట్ల శ్రద్ధ అవసరం



వెలగవలస హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: తమ పిల్లల చదువుల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని వెలగవలస హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎక్కువ సేపు ఆటలకు పరిమితం కాకుండా.. ప్రభుత్వం అమలు చేస్తున్న 'అందరం పుస్తకాలు చదివేద్దాం' కార్యక్రమంలో పిల్లలు పాల్గొనేలా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికి ముందు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో 2023–24 ఏడాదికి గాను ఆస్తిపన్ను చెల్లింపులో రాయితీకి ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. శనివారం జీఎంఆర్ ఇనిస్టిట్యూట్‌తో పాటు పట్టణంలో పలుచోట్ల పన్నువసూళ్లను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది ముందుగా చెల్లించే వారందరికీ 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. దీనిలో భాగంగా రూ.22 లక్షలు మేర జీఎంఆర్ సంస్థ పన్ను చెల్లించిందన్నారు.

'ఉపాధి' వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామంలో జంగమ్మ వారి చెరువు దగ్గర జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద వేతనదారులకు శనివారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వేసవి నేపథ్యంలో ఎవరూ వడదెబ్బ బారినపడకుండా ఉండేందుకే వీటిని పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు.

ఘనంగా విశ్వసాయి మందిర వార్షికోత్సవం



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరం వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

బిల్లులు ఇవ్వని చరిత్ర టీడీపీదే...

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మల్లమ్మదేవి పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: చేసిన పనులకు బిల్లులు ఇవ్వని చరిత్ర టీడీపీ నాయకులదని.. ఇండోర్ స్టేడియం పునాదులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకపోతే సంబంధిత కాంట్రాక్టర్ పునాదుల్లోని గ్రావెల్ తరలించుకపోయిన సంఘటనలు టీడీపీ హయాంలో చోటుచేసుకున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. టీడీపీ హయాంలో మంజూరై ప్రారంభంలోనే నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు ఆరు ఎకరాలున్న ఈ ప్రాంతాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా దశలవారీగా నిర్మిస్తామన్నారు.

సుందరీకరణ పనులకు ప్రతిపాదనలు..

పట్టణంలోని రాణిమల్లమ్మదేవి పార్కు వెనుక గల మల్లమ్మ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, లైటింగ్, గార్డెనింగ్ నిర్మించాలనే యోచనలో ఉన్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. చెరువు వద్ద గల వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. అనంతరం బొబ్బిలి – బలిజపేట జంక్షన్‌ను సందర్శించి వైఎస్సార్ విగ్రహం వద్ద సుందరీకరణ పనులక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ టి. రాజారావు, మున్సిపల్, రెవెన్యూ అధికారులున్నారు.

జనం నినాదం జగన్



రేగిడి: లింగాలవలసలో మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న ఎంపీటీసీ నర్సింగరావు, గ్రామస్తులు

వాడవాడలా నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. ఎక్కడికి వెళ్లినా జై.. జగన్.. జయహో.. వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ శ్రేణులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా పాల్గొని, ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



బాడంగి: కోడూరులో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ సలహాదారు మధుసూదనరావు తదితరులు



వంగర: కొప్పరలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం: వీఆర్ అగ్రహారంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం సిటీ: బొద్దాంలో ప్రచారంలో వైస్ ఎంపీపీ వర్షిణి, సర్పంచ్ తవిటమ్మ



సంతకవిటి: బూరాడపేటలో సర్పంచ్ హరిబాబు ప్రచారం

ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ గోవిందరావు



మాట్లాడుతున్న స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ ఎన్. గోవిందరావు

రామభద్రపురం: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ ఎన్. గోవిందరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ పట్టా ఉన్నంత మాత్రాన ఉద్యోగం దొరకడం కష్టమని.. చదువుకు తగ్గ కొలువు దక్కించుకోవాలంటే అదనపు నైపుణ్యాలు తప్పనిసరన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కేంద్రాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణతో పాటు ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషన్, సూయింగ్ మిషన్ ఆపరేటర్లు, తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటివరకు మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందిన 150 మందికి సర్టిఫికెట్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం 180 మంది వరకు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అనంతరం మండల అభివృద్ధిపై మండల స్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు, చొక్కాపు శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

రేగిడి: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా ఇన్‌స్ట్రక్టర్లు ఎం.రామకృష్ణ, కె.శైలజలు తెలిపారు. శనివారం మండలంలోని ఖండ్యాం గ్రామ పాఠశాలలో విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగాసనాలు వేసి, ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయ్‌కుమార్, ఆయుర్వేద వైద్యాధికారి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదర్శనగర్‌కు చెందిన గంగవరపు గోవిందరావు గాయపడినట్లు ఎస్‌ఐ వీబీ రామకృష్ణ శనివారం తెలిపారు. షెలూన్ షాను నిర్వహిస్తున్న గోవిందరావు విధులు ముగించుకుని, ఇంటికి నడిచి వెళ్తుండగా రాజాం వైపు నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి బాధితుడిని తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతికి చర్యలు

- హౌసింగ్ డీఈఈ రత్నాకర్



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ రత్నాకర్



సుందరాడలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ అప్పయ్య, ఎంపీడీఓ రామకృష్ణ

రామభద్రపురం: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతికి చర్యలు తీసుకుంటున్నట్లు హౌసింగ్ డీఈఈ రత్నాకర్ అన్నారు. శనివారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... బొబ్బిలి రూరల్, రామభద్రపురం మండలాల్లో జగనన్న లే అవుట్‌లతో పాటు సొంత స్థలాల్లో 4,472 ఇళ్లు మంజూరు చేయగా, 2,625 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు రూ.49 కోట్ల పైబడి బిల్లులు చెల్లించామన్నారు. జగనన్న లే అవుట్‌లలో ఇంటి నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా నీటి వసతి, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ స్తంభాల మార్పు, ఇంటర్నల్ రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వై. సత్యారావునాయుడు ఉన్నారు.

వేగవంతంగా నిర్మాణాలు..

తెర్లాం: జగనన్న ఇళ్ల కాలనీల్లో, సొంత స్థలాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని బొబ్బిలి గృహ నిర్మాణశాఖ డీఈఈ పలగర అప్పయ్య, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని సుందరాడలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణదారులతో మాట్లాడుతూ, నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



త్రిమూర్తులు

సంతకవిటి: మండల పరిధిలోని మారుతీనగర్ కాలనీకి చెందిన తూతిక త్రిమూర్తులు కనిపించడం లేదని అతని భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఎం.వాసుదేవరావు శనివారం తెలిపారు. ఏప్రిల్ 18వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగిరాలేదని, బంధువుల ఇళ్లు, మరికొన్ని చోట్ల వెతికామని అయినా ఫలితం లేదన్నారు. 45 ఏళ్ల వయసు ఉంటుందని, ఆచూకీ తెలిసినవారు సంతకవిటి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు

- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబ్జీరావు



తెర్లాంలో ప్రారంభించిన డ్రోన్ సర్వే

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష' భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జీరావు మాట్లాడుతూ, చాలామంది రైతులు భూ సమస్యలతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారని, ఈ సర్వేతో అన్ని సమస్యలు తొలగిపోతాయన్నారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు మాట్లాడుతూ, భూముల రీసర్వేలో భాగంగా డ్రోన్ ఫ్లయింగ్ నిర్వహించామని, ఓఆర్‌ఐ మ్యాప్‌లు వచ్చిన వెంటనే సరిహద్దులు గుర్తించి, హద్దురాళ్లు పాతుతామన్నారు. కార్యక్రమంలో నర్సుపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడే గొండేల ఆనందరావు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు నర్సుపల్లి యశోద, మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, వీఆర్‌ఓ శకుంతల, సచివాలయ సర్వేయర్ మీసాల సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

- ఎంపీడీఓ రామకృష్ణ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: సచివాలయంలో ప్రతిరోజూ స్పందన కార్యక్రమం నిర్వహించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని సుందరాడ గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల బయోమెట్రిక్, ఫేషియల్ హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలపై ప్రజలు, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎవరికైనా పథకం వర్తించకపోతే కారణం ఏమిటో వివరించాలని సూచించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఆకట్టుకున్న విద్యార్థినుల డ్యాన్స్

రాజాం: మండలంలోని కొత్తవలస యూపీ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ప్రొగ్రాస్ కార్డులు ఇచ్చి, సత్కరించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ప్రతినిధులు ఎల్.రాజు, గోవిందరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని చూరగొన్నాం..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఈనెల 7 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని లక్షా 25 వేల కుటుంబాలను నేరుగా కలిసి, వారి నమ్మకాన్ని చూరగొన్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఐదు ప్రశ్నలు వేసి సమాధానలు తెలుసుకోవడంతో పాటు జగనన్న పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నామన్నారు. గతంలో ఎప్పుడే పొందని లబ్ధిని వైఎస్సార్‌సీపీ హయాంలో పొందినట్లు చాలామంది చెప్పారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ గెలిపించుకుంటామని చెబుతుండడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల వద్ద నమోదు చేసుకున్న పుస్తకాలను ఆయన ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్‌చైర్మన్ గొలగాని రమాదేవి, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తెంటు పార్వతి, తెర్లాం, బాడంగి ఎంపీపీలు ఎన్. ఉమాలక్ష్మి, భోగి గౌరి, జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జ్‌లు రేజేటి ఈశ్వరరావు(విసు), తమ్మిరెడ్డి దామోధర రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూవీఎల్ఎన్ రాయలు, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ చదివేలా ప్రోత్సహించండి

వంగర: వేసవి సెలవుల్లోనూ పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, పిల్లల విద్యాప్రగతిని వివరించారు. సెలవుల్లో పిల్లలను సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉంచాలని, ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళ్లకుండా చూడాలన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రేగిడి: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని రాజాం జీఎంఆర్‌ఐటీ ఎన్.ఎస్.ఎస్ పోగ్రాం అధికారి కేవీఎస్ ప్రసాద్ సూచించారు. శనివారం మునకలవలస గ్రామంలో నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ సేవా శిబిరంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి వైద్యపరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ప్రశాంతి, హరీష్ పాల్గొన్నారు.

స్టీల్ గ్లాసుల పంపిణీ

రాజాం: రాగిజావ తాగేందుకు వీలుగా ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన స్టీల్ గ్లాసులను పట్టణంలోని డోలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం అందజేశారు. వీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని హెచ్‌ఎం స్వర్ణరాణి కోరారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అపూర్వ ఆదరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించిందని, ఇదే వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సంకేతమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమ ముగింపు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ఏ గ్రామం వెళ్లినా అక్కడ ప్రజల నుంచి ప్రభుత్వానికి విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకులున్న గ్రామాల నుంచి కూడా ఇదే స్పందన రావడం విశేషమన్నారు. ఏ రాజకీయ నాయకుడు చేయలేని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని, ప్రజల గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పాలనపై ప్రజల అనుభవాలు, ఇంకా మెరుగైన పాలనకు ఏ విధమైన సౌకర్యాలు అవసరమనేదానిపైనే ఈ కార్యక్రమమన్నారు. సీఎం జగనన్న నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ సమర్థిస్తున్నారని, నియోజకవర్గంలో 88,775 గృహాలకు గాను 72,953 గృహాలను సందర్శించగా, 83 శాతం మంది పార్టీకి మద్దతు పలికారన్నారు. దీనికి కారణం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకత పాటించడమేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో పథకాల కోసం విసిగెత్తిపోయిన తమకు ఇప్పుడు బతుకుపై ఆశ పెరిగిందని ప్రజలు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జేసీఎస్ మండల కన్వీనర్లు కె.శ్రీరంగనాయుడు, పి.రామచంద్రినాయుడు, ఎం.విజయలక్ష్మి, ఆర్.రమేష్‌నాయుడులను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బి.నర్సింహులు, రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పి. శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీలు ఎన్.వర్షిణి, టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



సంతకవిటి: హౌసింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

సంతకవిటి: మండలంలోని చింతలపేట గ్రామంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శృంగవరపు రఘునాధాచారి మాట్లాడుతూ సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో ఏఈ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో శనివారం నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమంలో ఎంపీడీ బాసూరి శంకరరావు పాల్గొని, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, నిర్మాణాలు పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న మండలంలోని పెదశిర్లాం గ్రామానికి చెందిన రాజాన యోజితకు మంజూరైన రూ.2.24 లక్షల చెక్కును ఎమ్మెల్సీ శనివారం అందజేశారు. రెండు నెలల క్రితం సీఎం సహాయ నిధికి ఆర్థికసాయం కోసం అభ్యర్థించగా ఇప్పుడు మంజూరైందని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పి.రామచంద్రినాయుడు, సర్పంచ్‌లు కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.